క్లుప్తంగా

నేడు గ్రంథాలయంలో దశాబ్ది వేడుకలు

కోదాడఅర్బన్ : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా కోదాడ శాఖ గ్రంథాలయంలో ఆదివారం ఉత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ చైర్మన్ రహీం శనివారం తెలిపారు. ఉత్సవాలలో భాగంగా సాయంత్రం 5గంటలకు కవి సమ్మేళనాలు, కవిత పోటీలు, వ్యాస రచన పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ, అభివృద్ధి సంక్షేమంలో తెలంగాణ సాధించిన ప్రగతిపై వ్యాసరచన పోటీలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ హాజరవుతున్నట్లు చెప్పారు. అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

నడిగూడెం : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 12 నుంచి 20 వరకు ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ మన్నెం సోమయ్య శనివారం విలేకరులకు తెలిపారు. ప్రథమ సంవత్సరం ఉదయం తొమ్మిది గంటల నుంచి 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షలకు 120 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు చెప్పారు.

ఆసరా పెన్షన్ రూ. వెయ్యి పెంచాలి

హుజూర్‌నగర్ : ఆసరా లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.1000 పింఛన్ పెంచాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పాలకూరి బాబు కోరారు. శనివారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం వికలాంగులకు పింఛన్ రూ. వెయ్యి పెంచడం హర్షనీయమని అన్నారు. ప్రస్తుతం నిత్యాసర వస్తువుల ధరలు పెరగడంతో ప్రభుత్వం ఇస్తున్న పింఛన్ సరిపోక ఆసరా లబ్ధిదారులు ఇబ్బందులకు గురవుతున్నారని కావున రూ.వెయ్యి పెంచాలని కోరారు.

నియామకం

హుజూర్‌నగర్ : టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా పట్టణానికి చెందిన ఎం.సైదులు నియామకం అయినట్లు ఆ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ మండవ వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు పోలంపల్లి అశోక్ రాష్ట్ర కమిటీని ప్రకటించినట్లు ఆయన పేర్కొన్నారు.

వైభవంగా శోభాయాత్ర



శ్రీవేంకటేశ్వరస్వామి శోభాయాత్ర నిర్వహిస్తున్న పూజారులు, భక్తులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీ గోదా, పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ పుష్కర బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం స్వామివారి శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయం నుంచి శ్రీవారు, అమ్మవార్లు, అళ్వారుల శోభాయాత్ర సూర్య, చంద్ర, గరుడ ప్రభ, కల్పవృక్ష తదితర వాహనాలలో మేళతాళాలతో బయలు దేరి పొట్టి శ్రీరాములు సెంటర్ వరకు జరిగింది. వేకువజామున, సాయంత్రం వేళలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పూజారులు, పాకల మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభం ఊరేగింపు



ధ్వజస్తంభాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న గ్రామస్తులు

చిలుకూరు : మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయస్వామి దేవాలయంలో ఈ నెల 12వ తేదీన ప్రతిష్ఠాపన చేయనున్న ధ్వజస్తంభాన్ని శనివారం ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా గ్రామంలో ఊరేగింపుగా తీసుకెళ్లి ఆలయ ప్రాంగణంలో ఉంచారు. ఆదివారం ప్రత్యేక పూజలు, సోమవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ, ఆంజనేయస్వామివారి విగ్రహాల ప్రతిష్ఠ ఉన్నట్లు, అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గ్రూప్- 1 పరీక్షల నిర్వహణను యూపీఎస్సీకి అప్పగించాలి

నేరేడుచర్ల : గ్రూప్- 1 పరీక్షల నిర్వహణను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు అప్పగించాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని బురుగులతండాలో జరిగిన ఏఐవైఎఫ్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ పేపర్ లీకేజీలతో నిరుద్యోగులను మోసం చేశారని ఆరోపించారు. ఆదివారం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా జరిగే ఈ పరీక్షలను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు అప్పగించాలన్నారు. సమావేశంలో ఏఐవైఎఫ్ నాయకులు మాలోతు పవన్, లాల్, రాము, రవి, వినోద్‌కుమార్ ఉన్నారు.

నిర్మాణాలు నిదానం.. నెరవేరేనా లక్ష్యం

నత్తనడకన మన ఊరు- మన బడి పనులు

- ప్రారంభించి ఏడాది కావొస్తున్నా పూర్తి చేయని కాంట్రాక్టర్లు
- కొన్ని పాఠశాల్లో 50 శాతమే పూర్తి
- త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతున్న విద్యార్థులు



చిలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు

చిలుకూరు : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మన ఊరు- మన బడి పథకం పనులు నత్తనడకన సాగుతున్నాయి. చిలుకూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాల్లో అదనపు గదుల నిర్మాణ పనులు మందకొడిగా కొనసాగుతున్నాయి. పనులు ప్రారంభించి నెలలు గడుస్తున్నా నేటివరకు పూర్తి కాలేదు. గత విద్యా సంవత్సరంలో ప్రారంభించిన పనులు కనీసం ఈ విద్యా సంవత్సరం ప్రారంభం కావస్తున్నా నేటికీ పూర్తి కాలేదు. మన ఊరు- మన బడి పథకంలో భాగంగా మొదటి విడతలో చిలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.1.19 కోట్లు, బేతవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు రూ.76 లక్షల 84 వేలు, నారాయణపురంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు రూ.44 లక్షల 15 వేలు, సీత్లాతండ ప్రాథమిక పాఠశాలకు రూ.39 లక్షలు, జెర్రిపోతులగూడెం ప్రాథమిక పాఠశాలకు రూ.28 లక్షల 35 వేలు, కొండాపురం ప్రాథమిక పాఠశాలకు రూ.73 లక్షల 70 వేలు, రామాపురం అంబేద్కర్ నగర్ కాలనీ ప్రాథమిక పాఠశాలకు రూ.68 లక్షల 98 వేలు, పోలేనిగూడెం ప్రాథమిక పాఠశాలకు రూ. 24 లక్షలు మంజూరు చేసింది.

50 శాతం మాత్రమే..

కాగా, చిలుకూరు, బేతవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో గదుల నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. కానీ రామాపురం, సీత్లాతండా, జెర్రిపోతులగూడెం, నారాయణపురం, పోలేనిగూడెం ప్రాథమిక పాఠశాలల్లో 50 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. ఇక కొండాపురం ప్రాథమిక పాఠశాలలో పనులు ఇంకా ప్రారంభమే కాలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి త్వరితగతిన భవన నిర్మాణ పనులు నాణ్యవంతంగా సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

త్వరితగతిన పూర్తిచేస్తాం



మన ఊరు- మన బడి పథకం కింద పాఠశాలలో అదనపు గదులు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేస్తాం. కొన్ని పాఠశాలలో పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. కొన్ని చోట్ల కొంత నిదానంగా జరుగుతున్నాయి. పనులు రెగ్యులర్‌గా జరిగేలా చూస్తాను.

– సలీమ్ షరీఫ్, ఎంఈఓ, చిలుకూరు

లోక్ అదాలత్ తీర్పు అంతిమం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాంకుమార్

హుజూర్‌నగర్ : లోక్ అదాలత్‌లో జారీ అయ్యే తీర్పే అంతిమమని దానిపై అప్పీల్‌కు వెళ్లే అవకాశం లేదని సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాంకుమార్ అన్నారు. శనివారం హుజూర్‌నగర్ కోర్టులో జాతీయ మెగా లోక్ అదాలత్‌లో కక్షిదారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. దశాబ్దాల కాలం కోర్టుల చుట్టూ తిరిగినా లభించని ఉపశమనం లోక్ అదాలత్‌లో కేసులను రాజీ చేసుకోవడంతో కొన్ని నిమిషాలలోనే నూరు శాతం లభిస్తుందని చెప్పారు. కోర్టులో దావా దాఖలు చేసేందుకు కక్షిదారులు కోర్టుకు చెల్లించిన కోర్టు ఫీజును లోక్‌అదాలత్‌లో రాజీచేసుకోవడం ద్వారా తిరిగి పొందవచ్చని తెలిపారు. జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్ మాట్లాడుతూ రాజీ మార్గమే రాజమార్గమన్నారు. ఈ లోక్ అదాలత్‌లో క్రిమినల్ కేసులు 70, సివిల్ దావాలు 3 కేసులు రాజీపడగా ఆ కేసులను కొట్టి వేశారు. 350 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో రూ.9 లక్షలు, ఇతర పిట్టీ కేసులలో రూ.13 లక్షలు జరిమానా రూపంలో కక్షిదారులు కోర్టుకు చెల్లించారు. నాలుగు బ్యాంక్ దావాలలో రూ.1.70 లక్షల నగదును ఆయా బ్యాంక్‌కు కక్షిదారులు చెల్లించారు. స్థానిక స్టేట్ బ్యాంక్ వారు లోక్ అదాలత్‌కు వచ్చిన కక్షిదారులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు కాల్వ శ్రీనివాసరావు, కుక్కడపు బాలకృష్ణ, కమతం నాగార్జున, షేక్ సైదా హుస్సేన్, బార్ అసోసియేషన్ కార్యదర్శి జక్కుల నాగేశ్వరరావు, సీఐ రామలింగారెడ్డి, పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు, ఎస్‌ఐలు, న్యాయశాఖ, మండల న్యాయ సేవా సంస్థ సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

రాజీమార్గమే రాజమార్గం : సివిల్ జడ్జి

కోదాడఅర్బన్ : సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకునేందుకు రాజీ మార్గమే రాజమార్గమని కోదాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్. శ్యామ్‌సుందర్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె.భవ్య అన్నారు. శనివారం కోదాడ కోర్టులో మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రాజీ పడదగిన కేసులలో కక్షిదారులు రాజీ చేసుకుని తమ సమయాన్ని, ధనాన్ని ఆదా చేసుకోవాలని సూచించారు. లోక్ అదాలత్‌లో అన్ని కోర్టులలో సుమారు 800ల కేసులు పరిష్కారం అయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి సాధు శరత్ బాబు, లోక్ అదాలత్ సభ్యులు తమ్మినేని హనుమంతరావు, ఆవుల మల్లికార్జునరావు, ఎస్.పద్మ, ఎం.సంధ్య, పలువురు జూనియర్, సీనియర్ న్యాయవాదులు, పోలీసులు, కక్షిదారులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై అప్రమత్తంగా ఉండాలి

- వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి



గ్రామపెద్దల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి

మునగాల : జాతీయ రహదారి వెంట ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వికారాబాద్ ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి అన్నారు. శనివారం తన అమ్మమ్మ గ్రామం మండలంలోని ముకుందాపురం వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్, స్టాప్ బోర్డులు, బారికేడ్లను ఆయన ప్రారంభించారు. అనంతరం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో రాజకీయాలకతీతంగా గ్రామపెద్దలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముకుందాపురంలో ఈనెల 14న నిర్వహించనున్న బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవాన్ని ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. అదేవిధంగా గ్రామంలో జాతీయ రహదారి పక్కన శివాలయం నిర్మాణానికి ఉద్యోగస్తులు, ఎన్ఆర్ఐలు, రైతులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో పందిరి నాగిరెడ్డి, నర్రా సత్యనారాయణరెడ్డి, ముస్కుల సైదిరెడ్డి, ముస్కుల గోవిందరెడ్డి, రెణబోతు అప్పిరెడ్డి, నర్రా ఇంద్రశేఖర్‌రెడ్డి, బోళ్ల వెంకటరెడ్డి, విలాస కవి రాజు, శ్రీనివాసరెడ్డి, సీతరామిరెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా కేసీఆర్

కోదాడ రూరల్ : రాష్ట్రంలో దివ్యాంగులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎంపీపీ చింత కవిత అన్నారు. ప్రభుత్వం దివ్యాంగుల పెన్షన్‌ను రూ.వెయ్యి పెంచి రూ.4,016లు చేసిన సందర్భంగా మండలంలోని గుడిబండలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి దివ్యాంగులతో కలిసి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు మహ్మద్ సలీం, కుక్కడపు ఖాజా, సొంపంగు అంబేద్కర్, పాయిలపంగు భిక్షం, ఊదర బాబు, దివ్యాంగులు పాల్గొన్నారు.



సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎంపీపీ కవిత, దివ్యాంగులు

వైద్యఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

- డిప్యూటీ డీఎంహెచ్ఓ నిరంజన్



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ నిరంజన్

హుజూర్‌నగర్ : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 14న వైద్య ఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ నిరంజన్ అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లోని ఏరియా హాస్పిటల్‌లో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కోరారు. దీనిలో భాగంగా ఏడు నుంచి తొమ్మిది నెలలలోపు గర్భిణులకు పోషక విలువలతో కూడిన కిట్లను, ఏఎన్ఎం, ఆశాలకు యూనిఫాంలు పంపిణీ చేయాలన్నారు. విశిష్ట సేవలు అందించిన ఉద్యోగులకు ఉత్తమ సేవా పురస్కారాలను అందించనున్నట్లు తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు వైద్య రంగంలో సాధించిన ప్రగతిని కరపత్రాల ద్వారా క్షేత్రస్థాయిలో తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సాహితీ, ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ కరుణ్ కుమార్, మండల వైద్యాధికారులు సన, సుధాకర్‌నాయక్, నాగిని, వేణుగోపాల్, నరేష్, జగదీశ్వర్, వివిధ ఆరోగ్య కేంద్రాల సూపర్‌వైజర్లు, వైద్య ఉద్యోగులు పాల్గొన్నారు.

బాలాజీ మృతి కాంగ్రెస్‌కు తీరని లోటు



బాలాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ ఉత్తమ్, మాజీ ఎమ్మెల్యే పద్మావతి, నాయకులు

చిలుకూరు : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బాదావత్ బాలాజీ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని ఎంపీ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం బాలాజీ స్వగ్రామమైన మండలంలోని సీత్లాతండాలో జరిగిన ఆయన సంతాప సభలో పాల్గొని మాట్లాడారు. బాలాజీ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని చెప్పారు. కోదాడ మాజీ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి, నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు



స్వామివారి విగ్రహాల ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

చిలుకూరు : పాత చిలుకూరులో బొడ్రాయి, ముత్యాలమ్మల విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రామాలయ ఆవరణలో సుప్రభాత సేవ, గోపూజ, యాగశాల ప్రవేశం, అగ్నిమథనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు జంటలు పీఠలపై కూర్చొని పూజలు చేశారు. అనంతరం బొడ్రాయి, దేవతామూర్తులను గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఆదివారం బొడ్రాయి, ముత్యాలమ్మ తల్లి విగ్రహాల జలబిందెల గ్రామోత్సవం ఉన్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం విగ్రహాల ప్రతిష్ఠ, అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. రెండు రోజుల పాటు పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు ఆలయ పూజారులు బుర్ర వాసుదేవాచార్యులు, సిరికొండ అనంతకృష్ణామాచార్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

కొనసాగుతున్న కంఠమహేశ్వరస్వామి వార్షికోత్సవం



గంపలతో ఆలయానికి తరలివెళ్తున్న గౌడ కులస్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గౌడ కులస్తుల ఆధ్వర్యంలో శ్రీకంఠమహేశ్వర స్వామి ఆలయ మూడవ వార్షికోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా శనివారం ఉదయం సుప్రభాతసేవ, గణపతి పూజ, ఆరాధన, పుణ్యాహవచనం నిర్వహించారు. మహిళలు బోనాలతో పెద్ద ఎత్తున ఆలయానికి తరలి వచ్చి స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కాసాని గురవయ్య గౌడ్, యరగాని రామస్వామి, గోపాలం, కిరణ్‌గౌడ్, మట్టపల్లిగౌడ్, భిక్షంగౌడ్, నర్సింహారావుగౌడ్, నాగరాజు, గురవయ్య, సైదులు, కుల పెద్దలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శశిధర్‌రెడ్డి జన్మదిన వేడుకలు



కోదాడఅర్బన్: శశిధర్‌రెడ్డిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, నాయకులు

కోదాడఅర్బన్ : టీఆర్ఎస్ పార్టీ ఉద్భవించిన నాటి నుంచి కోదాడ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేసిన వ్యక్తి కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి అని కోదాడ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు వేనేపల్లి చందర్‌రావు అన్నారు. శనివారం బీఆర్ఎస్ పార్టీ కోదాడ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని చందర్‌రావు ఇంట్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శశిధర్‌రెడ్డితో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎర్నేని వెంకటరత్నంబాబు, డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్తవరపు పాండు రంగారావు, జెడ్పీటీసీలు కొణతం ఉమా శ్రీనివాసరెడ్డి, శిరీషానాగేంద్రబాబు, కవిత నాగరాజు, చిలుకూరు ఎంపీపీ ప్రశాంతి కోటయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ శిరీషాలక్ష్మీనారాయణ, భాస్కర్‌రావు పాల్గొన్నారు.

ఎర్రవరంలో అన్నదానం

కోదాడ రూరల్ : బీఆర్ఎస్ నాయకుడు కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా శనివారం మండలంలోని ఎర్రవరంలో గల బాల ఉగ్రనరసింహ స్వామి సన్నిధిలో ఆయన అభిమానులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని శశిధర్‌రెడ్డి దంపతులు ప్రారంభించి, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు నాయకులు భాస్కర్‌రావు, రావుల వెంకటేశ్వర్లు, కొణతం శ్రీనివాసరెడ్డి, నాగేంద్రబాబు, కోటయ్య, యుగంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

నడిగూడెం : కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. నాయకులు బాణాల నాగరాజు, గుండు విజయరామారావు, రామనర్సయ్య, ఉపేందర్, వీరబాబు, లక్ష్మీనారాయణ, షేక్.జానీ, ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

మునగాల : బీఆర్ఎస్ నాయకుడు కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం మండల కేంద్రంలో ఆయన అభిమానులు, శశిధర్‌రెడ్డి యువసేన సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. రాయి రవి, పందిరి పుల్లారెడ్డి, సతీష్, లక్ష్మీనారాయణ, సైదులుయాదవ్, వంశీ పాల్గొన్నారు.

మోతె : మండల కేంద్రంలో శనివారం బీఆర్ఎస్ పార్టీ నాయకుడు కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి జన్మదిన వేడుకలను సర్పంచ్ మెట్టు అలివేలు నారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. బొడ్డు సాలయ్య, రామచంద్రు, ఉపేందర్, లింగారెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణలో సుపరిపాలన అందిస్తున్నాం : ఎమ్మెల్యే



అనంతగిరి : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్



హుజూర్‌నగర్: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గూడెపు శ్రీనివాస్

అనంతగిరి : సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నామని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శనివారం మండలంలోని అమీనాబాద్‌లో నిర్వహించిన సుపరిపాలన దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు చేరువలో చేసేందుకు నూతన జిల్లాలను, మండలాలను ఏర్పాటు చేసి నిరంతరం సేవలు అందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వాలు చేయలేని పనులను తెలంగాణ ప్రభుత్వం చేసిందన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం యంత్రాంగం భాగస్వామ్యంతో సమష్టి కృషి చేసి తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో అద్భుత ఫలితాలను ఇస్తుందన్నారు. అనేక పార్టీల నాయకులు ప్రజలను మభ్యపెట్టి ప్రలోభాలకు గురిచేసేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారని అటువంటి నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ సంతోష్ కిరణ్, ఎంపీడీఓ పరిమి విజయ, ఎంఈఓ సలీం షరీఫ్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ పార్టీల నాయకులు, గ్రామప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్ ఏర్పాటుతో సత్వర సేవలు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ రెవెన్యూ డివిజన్ ఏర్పాటుతో ప్రజలకు సత్వర సేవలు అందుతున్నాయని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, డీఏఓ ప్రకాష్ అన్నారు. పట్టణంలోని ఆర్‌డీఓ కార్యాలయంలో శనివారం సుపరిపాలన దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హుజూర్‌నగర్ డివిజన్ ఏర్పాటుతో ఈ డివిజన్‌లోని ప్రజలు రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం దూర ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా పోయిందని చెప్పారు. కౌన్సిలర్లు, ఆర్డీఓ కార్యాలయ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ముగ్గులు మన సంస్కృతికి ప్రతీక

హుజూర్‌నగర్ : ముగ్గులు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని మున్సిపల్ చైర్ పర్సన్ గెల్లి అర్చనరవి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శనివారం హుజూర్‌నగర్‌లో సుపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హుజూర్‌నగర్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. స్థానిక క్యాంప్ స్కూల్ వద్ద నుంచి బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వరకు దాదాపు 150 మంది మహిళలు పోటీలలో పాల్గొని రంగవల్లులను తీర్చిదిద్దారు. ఈ పోటీలలో చైర్ పర్సన్‌తో పాటు బీఆర్ఎస్ పార్టీ మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు దొంతిరెడ్డి పద్మ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలకు ఈనెల 16న బహుమతులు ప్రదానం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ నిలిగొండ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు, మున్సిపల్, మెప్మా సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

మహిళలకు ముగ్గుల పోటీలు

నేరేడుచర్ల : తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మున్సిపాలిటీలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న ప్రతిఒక్కరికీ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వల్లంశట్ల రమేష్ తల్లి వల్లంశెట్ల రంగమ్మ జ్ఞాపకార్థం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎస్‌కె బాషా, అలక సరితసైదిరెడ్డి, వేమూరి నాగవేణి, సుంకు సులోచన, మేనేజర్ అశోక్‌రెడ్డి, నాయకులు ఆకారపు వెంకటేశ్వర్లు, సుంకు శ్రీనివాస్, ఆర్‌పీలు ఉన్నారు.

సుపరిపాలన ర్యాలీ

గరిడేపల్లి : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో శనివారం సుపరిపాలన దినోత్సవం నిర్వహించారు. స్థానిక సర్పంచ్ కుసుమ వెంకటమ్మ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన గ్రామ సభలో ఆమె మాట్లాడారు. లక్ష్మీపురం గ్రామ పంచాయతీగా ఏర్పడిన తరువాత ఎమ్మెల్యే సైదిరెడ్డి సహకారంతో ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ జానకిరాములు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, వార్డు సభ్యులు ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు ఉన్నారు.

ప్రభుత్వ పథకాల అమలుపై అవగాహన

పాలకవీడు : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం మండల వ్యాప్తంగా సుపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రదర్శిస్తూ ర్యాలీలు చేపట్టారు. నూతన మండలం, కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటుతో ప్రజలకు దూరభారం తగ్గి పాలన చేరువైందన్న విషయాన్ని, ప్రభుత్వ పథకాల అమలు తీరును వివరించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

చింతలపాలెంలో..

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : పరిపాలనను ప్రజలకు చేరువ చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీపీ కె.వెంకటరెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చింతలపాలెంలో శనివారం సుపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిపాలన వికేంద్రీకరణ కోసం సీఎం కేసీఆర్ నూతన జిల్లాలు, మండలాలు, గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేశారని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పి.శ్రీనివాసరావు, ఎంపీడీఓ జె.శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ వాజిద్ అలీ, ప్రజాప్రతినిధులు, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



చింతలపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



నేరేడుచర్లలో మహిళలకు బహుమతులు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ జయబాబు



గరిడేపల్లి : లక్ష్మీపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు

ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ ఉత్సవాలు ప్రారంభం



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు గట్టు శ్రీకాంత్‌రెడ్డి

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని వేపలసింగారంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠ మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాత సేవ, గణపతిపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, మండపారాధన, అగ్నిప్రతిష్ఠ, గణపతి వాస్తుహోమం, మధ్యాహ్నం 12 గంటలకు నీరాజన మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు గట్టు శ్రీకాంత్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ అన్నెం శిరీషాకొండారెడ్డి, ఎంపీటీసీ ముడెం గోపిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్, పాలకవర్గ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

జెట్టి వెంకటరెడ్డి చిరస్మరణీయుడు

మునగాల : కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, బరాఖత్‌గూడెం గ్రామ మాజీ సర్పంచ్ జెట్టి వెంకటరెడ్డి చిరస్మరణీయుడని, ఆయన ఆశయసాధనకు యువత కృషి చేయాలని అభిమానులు కోరారు. జెట్టి వెంకటరెడ్డి 22వ వర్ధంతి సందర్భంగా శనివారం బరాఖత్‌గూడెంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గ్రామాభివృద్ధికి వెంకటరెడ్డి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో వెంకటరెడ్డి కుటుంబసభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.